క్లుప్తంగా

దళిత మహిళపై దాడి హేయం



పొన్నాడ రుషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కృష్ణా జిల్లా పెడన మండలం బల్లిపర్‌లో శనివారం ఓ దళిత మహిళ వస్త్రాలు చించి కొట్టడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు పొన్నాడ రుషి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భర్త ఒక సైనిక ఉద్యోగిగా దేశానికి సేవలు చేస్తున్న ఈ కుటుంబానికి జరిగిన అవమానం జాతి సిగ్గుపడేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడిపై ఎందుకు దాడి చేస్తున్నారన్న ప్రశ్నించినందుకు రాజకీయ పలుకబడితో స్థానిక వ్యక్తులు దాడి చేయడం ఆటవిక చర్యగా అభివర్ణించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగ అందజేస్తున్న దృశ్యం

గార: ఆది కూర్మక్షేత్రం కూర్మనాథాలయంలో స్థానిక కూర్మనాథ సేవకుల బృందం ఆదివారం స్వామివారి దర్శనానికి వచ్చే దూర ప్రాంత భక్తులకు మజ్జిగ అందజేశారు. తాబేళ్ల పార్కు సమీపంలో ఆలయ ఈవో కె.నరసింహనాయుడు, సభ్యులు పంపిణీ చేశారు.

దేవీ ఆశ్రమంలో వైశాఖమాస పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో వైశాఖ మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పత్రికా పఠనం అలవాటు చేసుకోవాలి



దినపత్రిక చదువుతున్న విద్యార్థి

ఎచ్చెర్ల: విద్యార్థులు పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం దిన, వార, పక్ష, మాసపత్రికల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. 40 మంది విద్యార్థులతో పత్రికలను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దినపత్రికలు చదవడం వల్ల ప్రపంచ విజ్ఞానం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

రేపు గ్రంథాలయ పరిరక్షణ సమావేశం

శ్రీకాకుళం కల్చరల్: ఇలిసిపురంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఈ నెల 6న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్ర గ్రంథాలయ పరిరక్షణ కోరుతూ ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకుడు ఎస్.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇదే జరిగితే వందలాది మంది నిరుద్యోగులు, యువకులకు నష్టదాయకమని పేర్కొన్నారు. ఇక్కడి సమావేశ మందిరం ఎన్నో సాహితీ సమావేశాలకు వేదికగా ఉపయోగపడుతోందన్నారు. దీన్ని పరిరక్షించుకునే బాధ్యత నగర ప్రజలందరిపైనా ఉందని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



తెరవే సమావేశంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ కళాశాల ఆవరణలో తెలుగు రచయితల వేదిక 104వ నెల సాహితీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెరవే అధ్యక్షుడు యు.నాగేశ్వరరావు మాట్లాడుతూ సాహిత్య విలువలు పెంపొందించేలా సామాజిక బాధ్యత గుర్తెరిగేలా నూతన శైలిలో కవితలు రాయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి ఆర్.రమణమూర్తి మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం పలువురు కవులు తమ కవితలను వినిపించారు. కార్యక్రమంలో బారువ కోమలరావు, ఐఎన్‌డీ ప్రసాద్, వి.శ్రీనివాసరావు, ఇద్ది పాపయ్య, తోట గోపాలరావు, కిల్లాన శ్రీనివాసరావు, ప్రసాదరావు, ముట్నూరు ఉపేంద్రశర్మ, భోగిల ఉమాకవి, లలితారెడ్డి, పూడి జనార్దనరావు, ఎస్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ముంచెత్తుతున్న మురుగు

- 50వ డివిజన్ ముచ్చవానిపేట జంక్షన్‌లో రోడ్డుపైనే డ్రైనేజీ నీరు
- వ్యర్థాలు, పూడికలతో నిండిన కాలువలు
- పలకల మీదుగా ప్రవహిస్తున్న మురుగునీరు
- ఇబ్బందుల్లో స్థానికులు

శ్రీకాకుళం రూరల్ : కాలువలు పూడికలతో నిండుగా ప్రవహిస్తుంటేనే భరించలేం. అలాంటిది రోజంతా మురుగునీరు కాలువ పైనుంచి రోడ్డుపైకి ప్రవహిస్తుంటే ఎంత దుర్వాసన వస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఇదే పరిస్థితి శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని 50వ డివిజన్ ముచ్చవానిపేట జంక్షన్(కిమ్స్ ఆస్పత్రి వెనుక వైపు ప్రాంతం) వద్ద నెలకొంది. పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భవన నిర్మాణ పనులు జరుగుతుండటంతో ఇసుక, సిమెంట్ మెటీరియల్స్‌తో పాటు ఇతరత్రా వ్యర్థాలన్నీ కాలువల్లో పడుతుండటంతో ఎక్కడికక్కడే పేరుకుపోయి మురుగునీరు ముందుకు వెళ్లని పరిస్థితి నెలకొంది. ప్రధాన కాలువ వద్ద నీరు నిలిచిపోయి పలకల మీదుగా రోడ్డుపైకి ప్రవహిస్తోంది. ఆ మురుగునీరు పైనుంచే పాదచారులు, వాహనచోదకులు ముక్కుమూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ముచ్చవానిపేట వద్ద డ్రైనేజీ పలకలపై ప్రవహిస్తున్న మురుగునీరు



డ్రైనేజీ పలకలపై నిలిచిన మురుగునీరు



ముందుకు కదలక నిలిచిపోయిన మురుగు

నిత్యం రద్దీ..

మురుగునీరు ముంచెత్తుతున్న ఈ కాలువ జంక్షన్ ప్రధాన రహదారి మాదిరిగానే నిత్యం రద్దీగా ఉంటుంది. శ్రీకాకుళం డేఅండ్ నైట్ జంక్షన్ నుంచి పీఎన్ కాలనీ మీదుగా ముచ్చవానిపేట ప్రాంతం వైపు ఇరువైపులా రాకపోకలు సాగించేందుకు ఇదే ప్రధాన రహదారి. ప్రస్తుతం మురుగునీరు ప్రవహిస్తున్న డ్రైనేజీ పలకలపైనే భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి.

చర్యలు తీసుకోవాలి..



ముచ్చవానిపేట దారిలో డ్రైనేజీపై ఏర్పాటు చేసిన పలకలు పూర్తిగా పూడికలు, వ్యర్థాలతో నిండిపోయాయి. వెంటనే వీటిని మార్చాలి. పెద్దపెద్ద వాహనాలు సైతం ఈ పలకలు మీదుగానే ప్రయాణిస్తుంటాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– ముచ్చ సూర్యనారాయణ, ముచ్చవానిపేట

డ్రైనేజీ నీటిని మళ్లించాలి..



కాలువల మీదుగా సిమెంట్ గొట్టాలు వేసి డ్రైనేజీ నీటిని దారి మళ్లించాలి. ఈ ప్రాంతంలో పెద్ద గొయ్యిలా ఏర్పడి అక్కడే డ్రైనేజీ నీరు నిల్వ ఉండిపోయింది. దీన్ని పూర్తిగా శుభ్రం చేయాలంటే పలకలు మార్చి వాటిపై కొత్తగా పైపులు ఏర్పాటు చేయాలి.

– ఎస్.సన్యాసిరావు, ముచ్చవానిపేట

సమస్య పరిష్కరిస్తాం..

ముచ్చవానిపేటలోని ప్రధాన డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం. సిబ్బందిని పంపించి పరిష్కార మార్గాన్ని కనుక్కుంటాం. డ్రైనేజీ పలకలపై మురుగునీరు వెళ్లకుండా వాటిని మార్చేలా తగు చర్యలు చేపడతాం.

– ప్రసాదరావు, శ్రీకాకుళం నగర కార్పొరేషన్ కమిషనర్

రామనామ దశకోటి మహాయజ్ఞం ప్రారంభం



పూజలు చేస్తున్న రుత్వికులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం శ్రీరామ నామ దశకోటి మహాయజ్ఞం, హనుమాన్ చాలీసా కోటి పారాయణ మహాయజ్ఞ పూర్ణాహుతి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హనుమత్ ఉపాసకులు అన్నదానం చిదంబరశాస్త్రి, రామ సేవకులు ఉలిమిరి వెంకట సోమయాజులు ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, ఆధ్యాత్మిక రామాయణ పారాయణ నిర్వహించారు. అనంతరం గాయత్రీ శ్రీరామ శ్రీహనుమాన్ మూలమంత్ర జపం, అగ్నిప్రతిష్టాపన, సామూహిక లలితా సహస్ర నామ పారాయణలు జరిగాయి. పిదప దూసి కనకమహాలక్ష్మీ బృందం భక్తి గాన సుధా లహరి అలరించింది. కార్యక్రమంలో భాస్కరభట్ల శ్రీరామశర్మ, నీరజా సుబ్రహ్మణ్యం, పి.వి.రమణమూర్తి, విశ్వనాథం కామేశ్వరరావు, కనుగుల సత్యం, బండారు వెంకటలక్ష్మీ, నేరెళ్ల విజయలక్ష్మీ, వెంకటలక్ష్మీ, కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రామాలయ ప్రతిష్టాపనోత్సవాలు



గోసాంలో నిర్మించిన రామాలయం

రణస్థలం: మండలంలోని గోసాం గ్రామంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. తొలిరోజు మంగళవారం గ్రామ పురోహితులు జోశ్యుల నాగేశ్వర శర్మ నేతృత్వంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలతో గ్రామ ప్రదక్షిణ, ఇతర పూజా కార్యక్రమాలు, సాయంత్రం 5 గంటలకు సకల దేవతా మండపారాధన, క్షీరాధివాసం నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం సూర్య నమస్కారాలు, ధాన్యాధివాసం, పంచశయ్యాధివాసం, గురువారం ఉదయం 6.48 గంటలకు విగ్రహాల ప్రతిష్టాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజులు అన్నదానంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, భక్తులు తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి



చెట్టుపొదిలాంలో బోరు బాగు చేయిస్తున్న దృశ్యం

జి.సిగడాం: గ్రామాల్లో దాహం కేకలు లేకుండా సకాలంలో తాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని రూరల్ డెవలప్‌మెంట్ ఏఈఈ యు.కుసుమ అన్నారు. ఆదివారం ఎస్.భీమవరం, చెట్టుపొదిలాం గ్రామాల్లో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బోర్లు మొరాయిస్తే 24 గంటల్లో బాగు చేయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భూపతి సురేష్‌కుమార్, తొత్తడి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి



భగీరథుని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం కల్చరల్: గంగాజలాన్ని భువికి తెచ్చిన భగీరథ మహర్షిని స్మరించడం మనందరి కర్తవ్యమని డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం భగీరథుని జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐ పైడపునాయుడు, ఆర్ఐ కె.నర్సింగరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగాదేవికి ప్రత్యేక అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజలలేశ్వరస్వామి దేవాలయంలో గంగాదేవి జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అశ్వినీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

బకాయిలేవి బాబూ!

- వేట నిషేధ భృతి బకాయి అందక మత్స్యకారుల ఆవేదన
- కూటమి సర్కారు నమ్మించి మోసం చేసిందని మండిపాటు



బుడగుట్లపాలెం తీరంలో బోట్లు

ఎచ్చెర్ల క్యాంపస్ : చేపల వేట నిషేధ భృతి బకాయి అందకపోవడంతో కూటమి సర్కారు తీరుపై మత్స్యకారులు మండిపడుతున్నారు. ఏటా ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 16 వరకు 61 రోజుల పాటు చేపల వేట నిషేధం అమల్లో ఉంటుంది. ఈ సమయంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.10 వేలు చొప్పున అర్హులందరికీ మత్స్యకార భరోసా అందజేసింది. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే రూ.20 వేలు పెంచి అందజేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే గద్దెనెక్కాక ఒక ఏడాది బకాయిలు విస్మరించడంపై మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత నెల 26న మత్స్యకారులకు వేట నిషేధానికి సంబంధించి 2025 ఏడాదికి సంబంధించిన భృతి మాత్రమే రూ.20వేలు అందజేశారు. 2024 అమలు చేయలేదు. ఎన్నికల హామీ మేరకు రూ.40 వేలు జమ చేయకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

ఇదీ పరిస్థితి..

ఎచ్చెర్ల మండలం, రణస్థలం మండలాల్లో డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలెం, జీరుపాలెం, కొవ్వాడ మత్స్యలేశం, కొచ్చెర్ల, అల్లివసవల, దోనుపేట తదితర గ్రామాల్లో చేపల వేట ఆధారంగా మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది ఎచ్చెర్ల మండలంలో 1800 మందికి, రణస్థలం మండలంలో 2591 మందికి మాత్రమే అందజేశారు. లబ్ధిదారుల సంఖ్య 20శాతం వరకు తగ్గించేశారు. గతంలో ఆధార్ కార్డు ఆధారంగా ఎంపిక చేయగా, ఇప్పుడు ప్రస్తుతం రేషన్ కార్డు ఆధారంగా ఎంపిక చేశారు. ఒక రేషన్ కార్డులో తండ్రీ కొడుకులు, అన్నదమ్ములు ఇలా ఇద్దరు వేటకు వెళ్లినా ఒకరికి మాత్రమే ఇచ్చారు. దీనికితోడు బకాయి చెల్లించకపోవడంతో మత్స్యకారులు మండిపడుతున్నారు.

ప్రస్తావనే లేదు



2024, 2025 ఏడాది సంవత్సరాలకు ఒక్కో లబ్ధిదారుకు రూ.40 వేలు అందజేయాలి. ఇటీవల రూ.20 వేలు మాత్రమే జమ చేశారు. ప్రభుత్వం మాట తప్పింది.

– అంబటి రాంబాబు, మాజీ సర్పంచ్, బుడగుట్లపాలెం

ఒకరికేనా..?



అన్నదమ్ములు, తండ్రీ కొడుకులు ఇలా కుటుంబంలో వేట మీద ఆధారపడిన అందరికీ గత ప్రభుత్వం మత్స్యకార భరోసా అందజేసింది. ప్రస్తుత ప్రభుత్వం రేషన్ కార్డులో ఒకరికి మాత్రమే అందజేసింది.

– మూగి గురుమూర్తి, మత్స్యకార నాయకుడు, డి.మత్స్యలేశం

మోసపూరిత హామీ



హామీ అంటే ఐదేళ్లు కొనసాగాలి. గత వైఎస్సార్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు మత్స్యకార భరోసా అమలు చేసింది. సూపర్ సిక్స్ హామీలు అన్నీ మోసపూరితమే. మాటకు విశ్వసనీయత ఉండాలి.

– బోర సాయిరాంరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు

అధ్వాన రహదారితో అవస్థలు



ఎచ్చెర్ల జాతీయ రహదారి నుంచి ఆర్టీవో కార్యాలయానికి వెళ్లే రహదారి రాళ్లు తేలి అధ్వానంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారి కావడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

శిథిలావస్థలో ప్లాట్‌ఫారం



బుడగుట్లపాలెం తీరంలో మత్స్యకారులు చేపలు ఆరబెట్టేందుకు నిర్మించిన ప్లాట్‌ఫారాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మట్టి చేరి పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో చేపలు ఆరబెడితే రంగు మారే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ప్లాట్‌ఫారాలకు మరమ్మతులు నిర్వహించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

పోటెత్తిన భక్తజనం



వైశాఖ మాసం సందర్భంగా ఆదివారం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చి శ్వేత పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఈవో కె. నరసింహానాయుడు క్యూలైన్లను పర్యవేక్షించారు.

– గార

ధర్మానను కలిసిన బుక్కూరు



ధర్మాన ప్రసాదరావుతో ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బుక్కూరు ఉమామహేశ్వరరావు ఆదివారం మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం చైర్మన్ ఎన్.చంద్రశేఖరరెడ్డికి ఉమామహేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు మాతృభాష తెలుగుతో పాటు ఇంగ్లిష్ భాషపైనా పట్టుసాధించాలని జిల్లా గ్రంథాలయశాఖ డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.శంకరరావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం రిసోర్స్ పర్సన్ సోడవరం సుమిత్ర ఇంగ్లిష్ పజిల్స్ పూరించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, రిసోర్స్‌పర్సన్ సోడవరం ఈశ్వరరావు, సిబ్బంది గణేష్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్: బలగ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం చిన్నారులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఉగ్రసేన మాట్లాడుతూ యోగాసనాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు అనిత, చిన్నారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ల అభివృద్ధిపై దృష్టి

జి.సిగడాం: విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం జి.సిగడాం మండలం బాతువ గ్రామానికి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జి.సిగడాం, బాతువ రైల్వేస్టేషన్లలో సౌకర్యాలు లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. జి.సిగడాం స్టేషన్‌లో ఇంటర్‌సిటీ, విశాఖ రైలు నిలుపుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ డబ్బాడ కళ్యాణి, తెలుగు దేశం మండల పార్టీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, డబ్బాడ ఆదినారాయణ, కూనిబిల్లి కూర్మారావు, నక్క మురళి పాల్గొన్నారు.